శనివారం హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో ప్రపంచ అందాల పోటీల ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి జూపల్లి తదితరులు

అందాల పోటీలను ప్రారంభించిన సీఎం

హైదరాబాద్, మే 10 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో 72వ ప్రపంచ సుందరి అందాల పోటీలను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. శనివారం సాయంత్రం గచ్చిబౌలిలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. భారత్–పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో అందాల పోటీల ప్రారంభోత్సవానికి సీఎం హాజరు కావడంలేదని మొదట సీఎంవో తెలిపింది. కానీ ఇరుదేశాల కాల్పుల విరమణతో షెడ్యూల్ మార్చుకున్నట్టు పేర్కొంది. 120 దేశాలకు చెందిన యువతులు పాల్గొననున్న ఈ పోటీల కోసం ఇప్పటికే 111 మంది నగరానికి చేరుకున్నారు. వీరికి ప్రభుత్వ ప్రతినిధులు ఎయిర్‌పోర్టులో స్వాగతం పలికారు. జూన్ 1న హైటెక్స్‌లో ఫైనల్ పోటీ జరగనుంది. విజేతలు జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాల్లో పాల్గొనున్నారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

యుద్ధ వాతావరణంలో అందాల పోటీలా?

- పిచ్చోడి చేతిలో రాయిలా సీఎం రేవంత్ రెడ్డి పాలన
- కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానందగౌడ్
- మురళీనాయక్‌కు ఘన నివాళి

హైదరాబాద్ మే 10 (నమస్తేతెలంగాణ): ఆహ్లాదకర పరిస్థితుల్లో నిర్వహించాల్సిన అందాల పోటీలను యుద్ధ వాతావరణంలో నిర్వహించడం ఎందుకని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానందగౌడ్ ప్రశ్నించారు. దేశ రక్షణ కోసం భారత సైన్యం విరోచితంగా పోరాడుతున్న వేళ సీఎం రేవంత్‌రెడ్డి మిస్ యూనివర్స్ పోటీల సమీక్షలో బిజీగా ఉన్నారని ఎద్దేవా చేశారు. పాక్ దాడిలో నేలకొరిగిన మురళీనాయక్‌కు బీఆర్ఎస్ తరపున శనివారం ఘనంగా నివాళులర్పించారు. అనంతరం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నాయకులు గెల్లు శ్రీనివాస్‌యాదవ్, కురువ విజయ్‌కుమార్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. సైన్యానికి సంఘీభావంగా దేశప్రజలంతా ర్యాలీలు, ప్రదర్శనలు నిర్వహిస్తుంటే ముఖ్యమంత్రి మాత్రం రాష్ట్రంలోని పౌరుల భద్రత కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. దేశవ్యాప్తంగా నెలకొన్న యుద్ధ వాతావరణంతో ఐపీఎల్ టోర్నీని వాయిదా వేశారని, కగార్ ఆపరేషన్‌ను నిలిపివేసిన ప్రస్తుత తరుణంలో కాంగ్రెస్ ప్రభుత్వం అందాల పోటీల షెడ్యూల్‌ను ప్రకటించడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. విమానాశ్రయాలు, పోర్టులను మూసివేయడంతో ధరలు పెరిగే అవకాశం ఉన్నదని ప్రజలు ఆందోళన చెందుతుంటే భరోసా ఇవ్వాల్సిన సీఎం బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. పంజాబ్, జమ్ముకశ్మీర్‌లో ఉన్న తెలంగాణవాసులు ప్రాణాలతో బిక్కుబిక్కుమంటూ రాష్ట్రానికి వచ్చేందుకు ఎదురు చూస్తున్నారని, ఆపదలో ఉన్నవారిని కాంగ్రెస్ ప్రభుత్వం గాలికొదిలేసిందని మండిపడ్డారు. ధాన్యం కొనే వారు లేక అల్లాడుతున్న అన్నదాతలను పట్టించుకొనే నాథుడే లేడని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం, మంత్రులు అందాల పోటీల వెంట వెంపర్లాడుతూ రాష్ట్రం పరువును గంగలో కలుపుతున్నారని నిప్పులు చెరిగారు. రోమ్ తగలబడుతుంటే నీరో చక్రవర్తి పిడేల్ వాయించిన చందంగా దేశంలో యుద్ధ వాతావరణం ఉన్నా.. సీఎం రేవంత్ అందాల పోటీలపై శ్రద్ధ చూపడం విడ్డూరంగా ఉన్నదని మండిపడ్డారు. రాష్ట్రంలో పాలన పిచ్చోడి చేతిలో రాయిలా మారిందని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా మిస్‌వరల్డ్ పోటీల నిర్వహణపై పునరా లోచించాలని డిమాండ్ చేశారు.

అందాల పోటీ కాదు.. ప్రజాధనం లూటీ

- బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి

ఆర్మూర్ టౌన్, మే 10: హైదరాబాద్‌లో నిర్వహించేవి అందాల పోటీలు కావని.. ప్రజాధనం లూటీ అని బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ధ్వజమెత్తారు. భారతీయ సంస్కృతికి మచ్చ తెచ్చేలా ఉన్న ప్రపంచ అందాల పోటీల నిర్వహణను వెంటనే విరమించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న సమయంలో కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారని మండిపడ్డారు.

అదానీ గ్రూపులోకి హైడ్రోజన్‌తో నడిచే ట్రక్

న్యూఢిల్లీ, మే 10: దేశంలో హైడ్రోజన్‌తో నడిచే ట్రక్కులను అదానీ గ్రూపు సంస్థలు తొలిసారి వినియోగించాయి. చత్తీస్‌గఢ్‌లోని గనుల్లో లాజిస్టిక్ అవసరాల నిమిత్తం 40 టన్నుల సరుకును తరలించే ఈ ట్రక్కును వినియోగించింది. 200 కిలోమీటర్ల దూరం ప్రయాణించే ఈ ట్రక్కును వాతావరణ కాలుష్యాన్ని నియంత్రించాలనే ఉద్దేశంతో వినియోగించినట్టు అదానీ ఎంటర్‌ప్రైజెస్ సీఈవో వినయ్ ప్రకాశ్ తెలిపారు. కాలుష్య ఉద్గారాలను తగ్గించడానికి అదానీ గ్రూపు మరో ముందడుగు వేసిందన్నారు.

సబ్సిడీలకు మంగళం!

ఎంఎస్ఎంఈలకు రూ.3,500 కోట్లు పెండింగ్ పెట్టిన ప్రభుత్వం

ఆఫీసు చుట్టూ చక్కర్లు కొడుతున్న బాధితులు

సర్కార్‌తో తేల్చుకోవాలని సూచించిన అధికారులు



హైదరాబాద్, మే 10 (నమస్తే తెలంగాణ): సబ్సిడీలకు రాష్ట్ర ప్రభుత్వం మంగళం పాడబోతున్నదా..ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే ఇది నిజమేననిపిస్తున్నది. కొంత సొంత పెట్టుబడి, మరికొంత బ్యాంకు వద్ద రుణం తీసుకొని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహకాలతో కొత్తగా పరిశ్రమలను ఏర్పాటు చేయాలని చూస్తున్న వారికి రాష్ట్ర సర్కార్ గట్టి షాకిచ్చింది. ప్రభుత్వ ప్రోత్సాహకాలు లేకుండా పరిశ్రమ పెట్టేవారు చాలా అరుదు. అయితే, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోయింది. భారీ పెట్టుబడులు వస్తున్నాయని, అంతర్జాతీయ సంస్థలు ఇక్కడ యూనిట్లను ఏర్పాటు చేస్తున్నాయని గొప్పలు చెబుతున్న రేవంత్ సర్కార్ ఇక్కడ పరిస్థితి పూర్తిగా భిన్నంగా తయారైంది. ప్రోత్సాహకాలు అందించడంలో పూర్తిగా విఫలమవుతున్నారు. చిన్న స్థాయి సంస్థల నుంచి మధ్య స్థాయి కంపెనీల వరకు సబ్సిడీల రూపంలో చెల్లించాల్సిన రూ.3,500 కోట్లు పెండింగ్‌లో ఉండటం చూస్తుంటే వీరికి మొండిచెయ్యి చూపించే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. గడిచిన ఏడాదిగా వీరికి సబ్సిడీలు అప్పుడు..ఇప్పుడు అంటు కాలం వెళ్లదీస్తున్నాయి తప్పా ముందుకు సాగడం లేదు.

ప్రకటనలు ఘనం.. చేతలు శూన్యం!

ప్రభుత్వ ప్రకటనలు, లక్ష్యాలు చూస్తుంటే ఉట్టికి ఎదరలేనమ్మ ఆకాశానికి ఎగిరినట్టుంది అనే సామెత గుర్తుకురాక మానదు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2025–26) ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రభుత్వం పరిశ్రమలు, వాణిజ్యశాఖకు రూ. 3,898 కోట్లు కేటాయించింది. ఇందులో భారీ పరిశ్రమల ప్రోత్సాహకాలకు రూ.1,730 కోట్లు, గ్రామీణ, చిన్నతరహా పరిశ్రమలకు రూ.1,049 కోట్లు, క్యాపిటల్ వర్క్స్‌కు రూ.371 కోట్లు, కేంద్ర ప్రాయోజిత పథకాలకు రూ.137 కోట్లు ఖర్చుచేయనున్నట్లు ప్రకటించింది. అంతేకాదు, వచ్చే ఐదేళ్లలో రూ. 4 వేల కోట్లతో 25వేలకు పైచిలుకు కొత్త ఎంఎస్ఎంఈ పరిశ్రమలను స్థాపించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇవి కాకుండా రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల పరిధిలో గ్రీన్‌ఫీల్డ్ ఫార్మా క్లస్టర్ల ఏర్పాటు చేసి అక్కడ యాంటీ బయోటిక్స్, సింథటిక్ డ్రగ్స్, వ్యాక్సిన్లు, న్యూట్రా స్యూటికల్స్, హెర్బల్ ఔషధ ఉత్పత్తులు, కాస్మోటిక్స్ తదితర వాటికి ప్రాధాన్యత కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. పారిశ్రామిక వికేంద్రీకరణే లక్ష్యంగా మెగా మాస్టర్‌ప్లాన్– 2050ని రూపొందించింది.. ఇందులో భాగంగా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో ఐటీ, ఫార్మా, హెల్త్‌కేర్, ఫుడ్ ప్రాసెసింగ్, స్పోర్ట్స్, ఆటోమొబైల్, గార్మెంట్స్, చేనేత, ఆభరణాలు తదితర క్లస్టర్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అలాగే, హైదరాబాద్–వరంగల్ పారిశ్రామిక కారిడార్ ఎన్‌హెచ్–163కి ఇరువైపులా పారిశ్రామిక క్లస్టర్లను ఏర్పాటు చేయాలని కూడా లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రభుత్వ ప్రణాళికలు బాగానే ఉన్నప్పటికీ ముందు చిన్నచిన్న యూనిట్లు పెట్టుకున్నవారికి ఇవ్వాల్సిన సబ్సిలు విడుదలచేస్తే బావుంటుందని పరిశ్రమవర్గాలు కోరుతున్నాయి.

యువతకు చేదువార్త

రాష్ట్ర ప్రభుత్వం గతేడాది సెప్టెంబర్‌లో నూతన ఎంఎస్ఎంఈ పాలసీని ప్రవేశపెట్టిన విషయం విదితమే. ఏడు నెలలు దాటినా ఇంతవరకు దీనికి సంబంధించిన మార్గదర్శకాలు జారీ చేయలేదు. ఈ నేపథ్యంలో చిన్న చితక యూనిట్లను ఏర్పాటు చేసుకునేందుకు ముందుకొచ్చిన యువతకు సబ్సిడీలు రావడంలేదనే చేదువార్త తెలుసుకొని వారు వెనక్కి తగ్గుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు దొరక్క ఏదో ఒక పరిశ్రమ ఏర్పాటు చేసుకొని సొంతకాళ్లపై నిలబడాలనుకునేవారు ప్రభుత్వ వైఖరితో తీవ్ర నిరాశకు గురవుతున్నారు. దాదాపు 20 వేలకిపైగా ఎంఎస్ఎంఈల వ్యవస్థాపకులకు రూ. 3,500 కోట్లవరకూ సబ్సిడీలు రావాల్సివుంది. ఇందులో ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి సుమారు రూ.1,650 కోట్లు కాగా, జనరల్ కేటగిరీలోనివారికి దాదాపు రూ.1,850 కోట్ల వరకు సబ్సిడీలు పెండింగులో ఉన్నట్లు అధికారవర్గాలు వెల్లడించాయి. భారీగా పెట్టుబడులు రాబడుతున్నట్లు సర్కారు గొప్పలు చెబుతున్నప్పటికీ ఏ ఒక్కటీ క్షేత్రస్థాయిలో కానరావడంలేదు. దీనికితోడు చిన్న పరిశ్రమలను ఏర్పాటు చేసుకునేవారికి కూడా ప్రోత్సాహకాలు ఇవ్వకపోవడంతో రాష్ట్రంలో పారిశ్రామికరంగం పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. మరోవైపు, సబ్సిడీల కోసం ఎంపికైన వారితో పరిశ్రమల శాఖ కార్యాలయం నిత్యం కిటకిటలాడుతున్నది. ప్రభుత్వం సబ్సిడీ మంజూరు చేయబట్టే తాము బ్యాంకు నుంచి రుణాలు తీసుకొని పరిశ్రమ ఏర్పాటు చేసుకున్నట్లు, ఇప్పుడు సబ్సిడీలు రాక, బ్యాంకులకు వడ్డీలు కట్టలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వారు వాపోతున్నారు. కాగా, అధికారులు మాత్రం తాము ఏమీ చేయలేమని చేతులెత్తేస్తున్నారు. ఏదైనా ఉంటే ప్రభుత్వంతోనే మాట్లాడుకోవాలని, ఆఫీసులో తమ పనులకు అంతరాయం కలిగించవద్దని వారు చిరాకుపడుతున్నారు.

కెనరా బ్యాంక్ ఎంసీఎల్ఆర్ తగ్గింపు

న్యూఢిల్లీ, మే 10: ప్రభుత్వరంగ సంస్థ కెనరా బ్యాంక్ కీలక నిర్ణయం తీసుకున్నది. మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్–బేస్డ్ లెండింగ్ రేటు(ఎంసీఎల్ఆర్)ను 10 బేసిస్ పాయింట్లు తగ్గిస్తున్నట్టు ప్రకటించింది. బ్యాంక్ తీసుకున్న తాజా నిర్ణయంతో ఎంసీఎల్ఆర్‌తో అనుసంధానమైన రుణాలు మరింత చౌకకానున్నాయి. అత్యధిక మంది రుణగ్రహీతలు తీసుకునే ఏడాది కాలపరిమితి కలిగిన రుణాలపై ఎంసీఎల్ఆర్ రేటు 9.10 శాతం నుంచి 9 శాతానికి దిగొచ్చాయి. మరోవైపు, నెల, మూడు, ఆరు నెలల రుణాలపై ఎంసీఎల్ఆర్ రేటు 8.25 శాతం నుంచి 8.80 శాతం మధ్యలోకి చేరాయి. అలాగే ఒక్కరోజు రుణాలపై విధించే వడ్డీరేటు కూడా 8.30 శాతం నుంచి 8.20 శాతానికి దిగొచ్చింది. తగ్గిన వడ్డీరేట్లు ఈ నెల 12 నుంచి అమలులోకి రానున్నట్టు బ్యాంక్ వెల్లడించింది

హైదరాబాద్‌లో సెర్టా తొలి షోరూం

హైదరాబాద్, మే 10: పరుపుల తయారీలో అగ్రగామి సంస్థ సెర్టా..రాష్ట్ర మార్కెట్లోకి అడుగుపెట్టింది. తన తొలి షోరూంను హైదరాబాద్‌లోని ఖాజాగూడ వద్ద ప్రారంభించింది. ఈ సందర్భంగా సెర్టా ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నితిన్ గుప్తా మాట్లాడుతూ..వ్యాపార విస్తరణలోభాగంగా వచ్చే ఏడాదిలోగా నగరంలో ఐదు ఎక్స్‌క్లూజివ్ స్టోర్లను ఏర్పాటు చేయడంతోపాటు తెలంగాణవ్యాప్తంగా 10 స్టోర్లను, దేశవ్యాప్తంగా 100 స్టోర్లను తెరవనున్నట్టు ప్రకటించారు. ఈ వ్యాపార విస్తరణతో తెలంగాణలో రూ.200 కోట్ల ఆదాయం ఆర్జించవచ్చునన్నారు. ఈ షోరూంలో రూ.30 వేలు మొదలుకొని రూ.4 లక్షల లోపు పలు రకాల పరుపులను అందుబాటులోకివుంచింది. ప్రస్తుతం భారత్‌లో సంఘటిత లగ్జరీ పరుపుల మార్కెట్ రూ.500 కోట్ల స్థాయిలో ఉందని చెప్పారు.

గచ్చిబౌలి స్టేడియం వద్ద ఉద్రిక్తత

మిస్ వరల్డ్ పోటీలను నిరసిస్తూ మహిళా సంఘాల ఆందోళన

శేరిలింగంపల్లి మే 10: మిస్ వరల్డ్ పోటీలను నిరసిస్తూ గచ్చిబౌలి స్టేడియం వద్ద ప్రగతిశీల మహిళా సంఘంతోపాటు ఇతర మహిళా సంఘాల కార్యకర్తలు శనివారం నిరసనకు దిగారు. ఈ సందర్భంగా మిస్‌వరల్డ్ పోటీలను వెంటనే నిలిపేయాలని డిమాండ్ చేస్తూ మహిళా సంఘాల కార్యకర్తలు స్టేడియంలోకి దూసుకెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో పోలీసులు, మహిళా సంఘాల కార్యకర్తలకు మధ్య తోపులాట జరిగి పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ రోడ్డుపై బైఠాయించారు. పరిస్థితిని గమనించిన పోలీసులు ఆందోళనకారులు, మహిళా సంఘాల కార్యకర్తలను మొయినాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా డెమోక్రటిక్ యూత్ ఆర్గనైజేషన్ (ఏఐడీవైవో), ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ స్టూడెంట్ యూనియన్ (పీడీఎస్‌యూ), ఆలిండియా మహిళా సాంస్కృతిక్ సంఘటన్ (ఏఐఎంఎస్ఎస్), ఆలిండియా డెమోక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ (ఏఐడీఎస్‌వో), పీడీఎస్‌యూ నాయకురాళ్లు వడ్ల జయ, రాణి, వీ సంధ్య, ఝాన్సీ, అనురాధ, అరుణ, మహేశ్, నాగరాజు, రవి, జయసుధ, సింహాద్రి, సావిత్రి, శ్రీదేవి, తిరుమల సవిత పాల్గొన్నారు.

అందాల పోటీలను రద్దు చేయాలని నిరసిస్తున్న చైతన్య మహిళాసంఘం సభ్యులు

అందాల పోటీలు రద్దు చేయాలి

మహిళాసంఘం కన్వీనర్ జ్యోతి

గద్వాల, మే 10 : రాష్ట్రంలో నిర్వహించే అందాల పోటీలను వెంటనే రద్దు చేయాలని చైతన్య మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ జ్యోతి డిమాండ్ చేశారు. శనివారం జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని కార్యాలయం ఎదుట మహిళలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల ఆత్మగౌరవాన్ని భంగపరిచే 72వ ప్రపంచసుందరి పోటీలను విరవించుకోవాలని సూచించారు. ప్రపంచ సుందరీమణుల పోటీలకు హైదరాబాద్ నగరం వేదిక కానున్నదని సీఎం రేవంత్ గొప్పగా చెబుతున్నాడని, వీటితో తెలంగాణకు ఒరిగేదేమీ లేదని చెప్పారు.

అదృశ్యమైన బాలిక.. ఏడేండ్ల తర్వాత ఇంటికి!

ముంబై, మే 10(నమస్తే తెలంగాణ): ముంబైలోని కల్యాణ్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏడేండ్లుగా మిస్టరీగా మారిన ఓ చిన్నారి అదృశ్యం కేసులో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. 9 ఏండ్ల వయసులో కనిపించకుండా పోయిన బాలిక, స్వచ్ఛంద సంస్థ సాయంతో 16 ఏండ్ల వయసులో తల్లిదండ్రుల వద్దకు చేరుకుంది. అసలేమైందీ... ఇన్నాళ్లు ఎక్కడుందో తెలిపింది. ఈ దారుణమంతా విన్న తల్లిదండ్రులు బోరున విలపించారు. 2018లో తనను ఓ మహిళ, మరో వ్యక్తి కలిసి కిడ్నాప్ చేశారని బాలిక తెలిపింది. వారు రాజస్థాన్‌కు చెందిన మరోవ్యక్తికి విక్రయించారని వెల్లడించింది. ఆ వ్యక్తి.. 2020 లో తన అల్లుడికి ఇచ్చి పెళ్లి చేశాడని వివరించింది. ఆ తర్వాత పెళ్లి చేసుకున్న వ్యక్తితో పాటు అతడి మామ తనపై లైంగిక వేధింపులకు పాల్పడేవారని తెలిపింది. స్వచ్ఛంద సంస్థ సాయంతో తన ఇద్దరు పిల్లలను వెంట బెట్టుకుని ముంబై వచ్చినట్టు వివరించింది. పోలీసులకు ఫిర్యాదు చేయగా బాలికను యువకుడిని, అతడి మామను అరెస్ట్ చేశారు. మరో ముగ్గురు నిందితుల కోసం గాలిస్తున్నారు. డీసీపీ అతుల్ జెండే, సీఐ జ్ఞానేశ్వర్ సాబ్లే దర్యాప్తు కోసం నాలుగు బృందాలను నియమించారు. స్వప్నిల్ భుజబల్, వికాస్ మడ్కేతో కూడిన బృందం నిందితుల కోసం వేట కొనసాగిస్తున్నదని చెప్పారు.

ఢిల్లీ కరుణించేదెప్పుడో!

- అధ్యక్షుడిని నియమించలేని పార్టీ ఒకటి.. మంత్రివర్గ విస్తరణ చేయలేని మరో పార్టీ..
- రాష్ట్రంలో రెండు జాతీయ పార్టీల్లో విచిత్ర పరిస్థితి
- ప్రతి దానికి ఢిల్లీవైపే చూపు.. వీరు పరిపాలనెలా చేస్తారనే విమర్శలు

హైదరాబాద్, మే 10 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని రెండు ప్రధాన జాతీయ పార్టీలు విచిత్రమైన పరిస్థితిని ఎదుర్కొంటున్నాయి. ఒకటి రెండేండ్లుగా రాష్ట్ర శాఖకు అధ్యక్షుడిని నియమించలేకపోగా, మరొకటి ఏడాదిన్నర నుంచి ధైర్యంగా మంత్రివర్గాన్ని విస్తరించలేకపోతున్నది. ఆ రెండు పార్టీలు ఏ చిన్న నిర్ణయం తీసుకోవాలన్నా 'ఢిల్లీ' ఆదేశాలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ముహూర్తాలు మారుతున్నాయే తప్ప.. మోక్షం కలగడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిర్ణయాల్లో నాన్చివేత ధోరణిపై రెండు పార్టీల్లోనూ కార్యకర్తలు, నేతలు అసహనం వ్యక్తం చేస్తుండటం గమనార్హం. రాష్ట్ర నేతలు కాళ్లు అరిగేలా ఢిల్లీ చుట్టు తిరుగుతున్నా.. ఇప్పుడు అప్పుడు అంటూ నాన్చడమే తప్ప నిర్ణయాలు తీసుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అధ్యక్ష పదవి కోసం బీజేపీ నేతలు, మంత్రివర్గ విస్తరణ కోసం కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఢిల్లీకి క్యూ కడుతున్నారు.

రెండేండ్లయినా తేలని బీజేపీ కొత్త సారథి...

బండి సంజయ్ తరువాత ఆయన స్థానంలో 2023, జూలైలో రాష్ట్ర అధ్యక్షుడిగా కిషన్‌రెడ్డిని తాత్కాలిక ప్రాతిపదికన బీజేపీ అధిష్ఠానం నియమించింది. త్వరలోనే కొత్త అధ్యక్షుడిని నియమిస్తామని ప్రకటించింది. కిషన్ రెడ్డి కూడా తాను టైమ్ గ్యాప్ కోసమే వచ్చానని, రెండు మూడు నెలల్లో కొత్త అధ్యక్షుడు వస్తారని వెల్లడించారు. మరో రెండు నెలలు గడిస్తే కిషన్‌రెడ్డి అధ్యక్షుడై రెండేండ్లు గడుస్తాయి. రోజుకో వివాదం.. రోజుకో కొత్త పేరు తెరపైకి వస్తుండటంతో రాష్ట్ర అధ్యక్షుడి ఎంపికపై బీజేపీ అధిష్ఠానం మల్లగుల్లాలు పడుతున్నది. బండి సంజయ్, ఈటల రాజేందర్, ధర్మపురి అరవింద్ మధ్య పోటీ నెలకొన్నట్టు తెలుస్తున్నది. వారిలో ఎవరికి పదవి కట్టబెట్టినా ఇతరులు సహకరించే పరిస్థితి ఉండదని, దీంతో కొత్త వివాదానికి తెరతీసినట్లవుతుందని అధిష్ఠానం భావిస్తున్నదని సమాచారం.

మంత్రివర్గాన్ని విస్తరించలేని కాంగ్రెస్

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావొస్తున్నది. కానీ ఇప్పటివరకు పూర్తిస్థాయిలో మంత్రివర్గాన్ని ఏర్పాటు చేయలేకపోయింది. ఇంకా ఆరు పదవులను భర్తీ చేయాల్సి ఉన్నది. దీనిపై నేడో రేపో మంత్రివర్గ విస్తరణ అంటూ ఏడాదిన్నర నుంచి ప్రచారం సాగుతున్నా.. కార్యరూపం మాత్రం దాల్చడం లేదు. గత నెలలో మంత్రివర్గ విస్తరణకు అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని, ఏప్రిల్ 3వ తేదీన కొత్త మంత్రుల ప్రమాణ స్వీకారమే మిగిలింది అని ప్రచారం చేశారు. కానీ అదంతా ఉత్త దేనని తేలిపోయింది. ఆశావాహులు ఎక్కువగా ఉన్నారని, ఒకరిపై వ్యతిరేకంగా మరొకరు లేఖలు రాశారనే సాకుతో విస్తరణను పక్కకు పెట్టినట్టు తెలిసింది. ఈ విధంగా జనవరి కానుక, సంక్రాంతి కానుక, చివరికి ఉగాది కానుక కూడా అందకుండా పోయింది. ఈ విధంగా ముహూర్తాలు మారుతున్నాయి... పండుగలు పోతున్నాయే తప్ప ఆశించిన వారికి మంత్రి పదవి మాత్రం దక్కడం లేదు.

పదవులే భర్తీ చేయలేనోళ్లు.. పరిపాలన ఏం చేస్తరు ?

బీజేపీ, కాంగ్రెస్ తీరుపై అన్ని వర్గాల్లోనూ తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతున్నది. పార్టీలో త్వరగా నిర్ణయాలు తీసుకోలేని వీళ్లు రాష్ట్రంలో పరిపాలన ఏం చేస్తారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధ్యక్షుడిని నియమించేందుకు రెండేళ్లు, మంత్రివర్గ విస్తరణ చేసేందుకు ఏడాదిన్నర పడుతుందా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. వీరికి రాష్ట్రంలో అధికారం ఎందుకు అని నిలదీస్తున్నారు. చీటికి మాటికి ఢిల్లీ నిర్ణయంపై ఆధారపడే పార్టీలు.. ఇక్కడ ప్రజలకు స్వతంత్రంగా సేవలు ఎలా అందిస్తారని అనుమానం వ్యక్తంచేస్తున్నారు.

విద్యుత్తు వైర్లు సరిచేస్తుండగా షాక్

స్తంభంపైనే ప్రైవేట్ హెల్పర్ మృతి

గొర్రెపల్లిలో విషాదం



నాగరాజ్ (ఫైల్)

మల్లాపూర్, మే 10: స్తంభం ఎక్కి విద్యుత్ వైర్లు సరిచేస్తుండగా, ప్రమాదవశాత్తూ షాక్ కొట్టి జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం గొర్రెపల్లికి చెందిన ప్రైవేట్ హెల్పర్ మాదం నాగరాజ్ (33) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం గ్రామ శివారులోని వ్యవసాయ విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఉండడంతో నాగరాజ్ విద్యుత్తు స్తంభం ఎక్కి తీగలు సరిచేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తూ పక్కనే ఉన్న 11 కేవీ లైన్‌కు తాకడంతో షాక్ కొట్టి అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన రైతులు విద్యుత్తుశాఖ అధికారులు, పోలీసులకు సమాచారం అందించారు. నాగరాజుకు భార్య శిరీష, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రాజు పేర్కొన్నారు.

రైతులకు భారంగా బత్తాయి..!

- దారుణంగా పడిపోయిన ధరలు
- నిరుడు టన్నుకు రూ.50వేలు
- ఈ సీజన్‌లో రూ.18వేలలోపే

హైదరాబాద్, మే 10 (నమస్తే తెలంగాణ): అకాల వర్షాల కారణంగా బత్తాయి పంటకు ఈ సీజన్‌లో ఎన్నడూ లేనివిధంగా సగానికిపైగా ధరలు పడిపోయాయి. ఏప్రిల్, మేలో వచ్చే 'కత్తెర' కాయకు ఏటా టన్నుకు రూ.40వేల నుంచి రూ.50వేల వరకు ధర పలికేది. ప్రస్తుతం రూ.18వేలకే పరిమితమై.. పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితులు కనిపించడం లేదు. బత్తాయిలో ఎదురవుతున్న ఇబ్బందుల దృష్ట్యా రైతులు తోటల్ని తొలగించి, వరి సాగువైపు మళ్లుతున్నట్టు ఉద్యానశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

వర్షాలతో తగ్గిన ఎగుమతులు..

ఉత్తర భారతదేశంలో తెలంగాణ బత్తాయికి మంచి డిమాండ్ ఉన్నది. ఏటా ఢిల్లీ, ఆగ్రా, జైపూర్, కోల్‌కతా, ముంబాయి ప్రాంతాలకు లారీల్లో వ్యాపారులు తరలిస్తారు. తోటల వద్దకు వ్యాపారులు స్వయంగా వచ్చి కొనుగోలు చేసేవారు. అకాల వర్షాల వల్ల బత్తాయికి డిమాండ్ తగ్గిపోవడంతో వ్యాపారులు కొనుగోలు చేసేందుకు ముందుకు రావడం లేదు.

అనంతపురం నుంచి తక్కువ ధరకు ..

ఏపీలోని అనంతపురంలో టన్ను బత్తాయి రూ.18వేలకే లభిస్తుండటంతో వ్యాపారులు ఇక్కడ కొనుగోలు చేసి ఉత్తర భారత ప్రాంతాలకు తరలిస్తున్నారు. దీంతో తెలంగాణ ప్రాంతానికి వచ్చి కొనేందుకు వ్యాపారులు ముందుకురావడం లేదు.

నల్లగొండలో తగ్గుతున్న సాగు విస్తీర్ణం..

బత్తాయి సాగులో దేశంలోనే నల్లగొండ జిల్లాకు మంచి పేరు ఉండేది. అప్పట్లో 3లక్షల ఎకరాల్లో రైతులు సాగు చేశారు. మార్కెట్‌లో సరైన ధర లభించకపోవడం, పెట్టుబడులు కూడా రాకపోవడంతో రైతులు క్రమంగా బత్తాయి తోటలను తొలగిస్తున్నారు. ఫలితంగా బత్తాయిసాగు జిల్లాలో 40వేల నుంచి 45వేల ఎకరాలకు పడిపోయిందని ఉద్యానవన శాఖ, వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు.

మార్కెట్ సమస్య ..

ఉమ్మడి నల్గొండ జిల్లాలో 50 వేల ఎకరాల విస్